క్లుప్తంగా

ఉండవెల్లిలో నేత్రదానం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని రఘురామయ్య శెట్టి కుమారుడు నరహరి మురళీకృష్ణ (38) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. అనంతరం కుటుంబ సభ్యులు మానవత్వంతో నేత్రదానం చేశారు. ఈ సందర్భంగా మృతదేహానికి ఘన నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి భార్య దీపిక, కుమారులు అద్విత్, సాయి హర్షిత్ ఉన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



మానవపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మహిళల కోలాటం



అలంపూర్ రూరల్: అలంపూర్ మండల పరిధిలోని క్యాతూర్ గ్రామంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఉట్టకొట్టు కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. దాతలు గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం మహిళలు పురవీధులు గుండా కోలాటాలతో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

అయిజ: మండలంలోని బింగుదొడ్డి గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బింగుదొడ్డి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. మహిళలు మంగళ హారతులు పట్టారు. చిన్నారుల కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

రాఘవేంద్రకు కన్నీటి వీడ్కోలు



గట్టు: కర్ణాటకలోని సైదాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గట్టు మండలం మాచర్ల గ్రామానికి చెందిన పీజీ రాఘవేంద్ర (42) మృతదేహాన్ని ఆదివారం కుటుంబసభ్యులు స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ ప్రమాదంలో రాఘవేంద్రతో పాటుగా ఇదే గ్రామానికి చెందిన అల్లుడు తాడు నాగన్న అలియాస్ నాగేష్(50) ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఇదిలా ఉండగా, కన్నకొడుకు పీజీ రాఘవేంద్ర చివరి చూపు కోసం ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తండ్రి పీజీ మాసున్న రాయచూర్ ఆస్పత్రి నుంచి అంబులెన్స్‌లో మాచర్లకు వచ్చి.. కడచూపు చూసి తిరిగి రాయచూర్‌కు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, స్టేట్‌కన్స్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బల్గెర హనుమంతు బాధిత కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కళాశాలలు ఏర్పాటు చేయాలి

అమరచింత: మున్సిపాలిటీ కేంద్రంలో డిగ్రీ, జూనియర్ కళాశాల నిర్మించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ కేంద్రంలో ప్రభుత్వ ఇంటర్ కళాశాల లేకపోవడం ద్వారా పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఆత్మకూర్, వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్ పట్టణాలను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల సమయంలో గెలిపిస్తే మండలంలో ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాల మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చిన మంత్రి వాకిటి శ్రీహరి హామీలు వెంటనే నెరవేర్చాలన్నారు. కళాశాలలు ఏర్పాటు చేయని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

బిల్లులు అందక వెతలు



అమరవాయిలో వంట చేస్తున్న నిర్వాహకులు

- నాలుగు నెలలుగా అందని మధ్యాహ్న భోజన బిల్లులు
- వంట చేయలేమంటున్న ఏజెన్సీలు
- పట్టించుకోని అధికారులు

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం బిల్లులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఏజెన్సీ నిర్వాహకులు వాపోతున్నారు. అప్పులు తెచ్చి వంట చేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదంటున్నారు. రూ.లక్షల్లో బకాయిలు ఉండటంతో పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్చి నుంచి..

ఈ ఏడాది మార్చి నెల నాలుగు నెలల మేర నుంచి బిల్లులు రాక అవస్థలు పడుతున్నట్లు ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. ప్రతి నెలా ప్రభుత్వం నుంచి బిల్లులు అందాల్సి ఉండగా పెరిగిన ధరలకు అనుగుణంగా ఒక్కో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి రూ. 10 వేల నుంచి రూ.50 వేలకు పైగా కిరాణం, కూరగాయలు, గుడ్లు, అరటిపండ్ల బిల్లులు అవుతున్నాయని మహిళలు వాపోతున్నారు. అప్పులు చేసి ప్రతి రోజు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, ఇక మధ్యాహ్న భోజనం చేసేందుకు తమ వల్ల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే తాము ఏజెన్సీల నుంచి తప్పుకోవాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు.

రూ.40 లక్షల వరకు బకాయిలు..

మల్దకల్ మండలంలో మొత్తం 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 4 ఉన్నత, 27 ప్రాథమిక పాఠశాలల్లో మొత్తం 6,848 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మొత్తం 40 పాఠశాలలకు వంట ఏజెన్సీలు 40 ఉండగా వాటిలో 112 మంది వంట నిర్వాహకులు పని చేస్తున్నారు. వారికి ప్రతి నెలా రూ.10 లక్షల బిల్లులు ప్రభుత్వం నుండి రావాల్సి ఉండగా నాలుగు నెలల మేర పెండింగ్‌లో ఉండటంతో సుమారు రూ.40 లక్షలకు పైగా పెండింగ్‌లో ఉండడంతో వంట ఏజెన్సీ నిర్వాహకుల పరిస్థితి అగమ్యఘోచరంగా తయారైందని వాపోతున్నారు.

అదనంగా భారం

ప్రభుత్వం ఇస్తున్న గుడ్డు ధరకు ప్రస్తుతం మార్కెట్‌లో రూ.7కు పైగా పలుకుతుందని పేర్కొన్నారు. దీంతో తమపై అదనంగా రూ.2 చొప్పున భారం పడుతుందంటున్నారు. వడ్డీలకు తెచ్చి భోజనం తయారు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. విద్యాశాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరగా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వంట ఏజెన్సీ నిర్వాహకులు కోరుతున్నారు.



మల్దకల్‌లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

వడ్డీ కట్టలేకపోతున్నాం



ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించకపోవడంతో వడ్డీలకు తెచ్చి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, గుడ్లు అందించాం. గుడ్ల ధరలు పెరగడంతో మరింత భారంగా ఉంది. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నాం.

–యాదగిరి, వంటఏజెన్సీనిర్వాహకుడు, అమరవాయి

సరుకులు ఇవ్వడం లేదు



విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం కోసం కిరాణం దుకాణంలో సరుకులు ఉద్దర ఇవ్వడం లేదు. ఇప్పటికే నాలుగు నెలలు పెండింగ్ బిల్లులు ఉండటంతో సరుకులు తీసుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– సత్యమ్మ, మల్దకల్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



నాలుగు నెలలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరులో కొంత ఆలస్యమైంది.

– సురేష్, ఇన్‌చార్జ్ ఎంఈఓ, మల్దకల్

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



కర్నూలులో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు



గద్వాలలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల: పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్లకృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం క్యాంప్ కార్యాలయంలో గట్టు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, సుదర్శన్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, తిమ్మప్ప, భాస్కర్, శ్రీను, ఆంజనేయులుగౌడ్, షెడ్రిక్, నజీర్‌అహ్మద్, వెంకటన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అలంపూర్: కర్నూలులోని ఎమ్మెల్యే నివాసంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే విజయుడు లబ్ధిదారులకు అందజేశారు. వడ్డేపల్లి మండలం తనగల గ్రామానికి చెందిన కమ్మరి రాఘవేంద్ర ఆచారికి రూ.31,500, ఎర్రవల్లి మండలం వీరాపురం గ్రామానికి చెందిన శంకరమ్మకు రూ.60 వేల మంజూరైనట్లు పేర్కొన్నారు.

విజయవంతంగా ముగిసిన మహాసభలు



కార్యవర్గ కమిటీతో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు రాజమల్లు వెంకటస్వామి

గద్వాల: మున్సిపల్ కార్మికుల 3వ జిల్లా మహాసభలు విజయవంతంగా ముగిశాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆదివారం మున్సిపల్ కార్మికుల మహాసభలు ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 22 మందితో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా నర్సింహ, జిల్లా అధ్యక్షుడుగా సంజీవరాజు, ఘట్టన్న, కోశాధికారిగా మహేందర్, ఉపాధ్యక్షులుగా మహేష్‌కుమార్, లలితమ్మ, వీరేష్‌గౌడ్, శివన్న, సహాయ కార్యదర్శులుగా గడ్డం నర్సింహ, ఎస్.పద్మ, మహేశ్వరి, ఏసేపును ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం వెంకటస్వామి మాట్లాడుతూ.. ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేయాలని, అదే విధంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వాలని, కార్మికులకు నెలనెలా వేతనాలు క్రమం తప్పకుండా అందజేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అందజేయాలన్నారు. నెలవారి సరుకులు, బట్టలు, రెయిన్‌కోట్లు పంపిణీ చేయాలని తీర్మానం చేసి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజమల్లు, ఉప్పేరు నర్సింహ, డ్యాం అంజి, తిమ్మప్ప, సంజీవ్‌రాజు, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారు పేరు 'వీహెచ్‌పీ'



రాజోళిలో మాట్లాడుతున్న నాయకులు

రాజోళి/శాంతినగర్: క్రమశిక్షణ, సంస్కృతి సాంప్రదాయాలకు మారుపేరు విశ్వ హిందూ పరిషత్ అని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు అల్లూరి ఫణిమోహన్ అన్నారు. ఆదివారం విశ్వహిందూ పరిషత్ 62వ ఆవిర్భావ దినోత్సవం మండల కేంద్రంలోని ఘనంగా నిర్వహించారు. స్థానిక భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయంలో కాషాయ ధ్వజాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అణగారిపోతున్న సాంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుతూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సమాజోద్ధరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొంకతి రాము, నాగరాజు, అడివిస్వామి, సునీల్ తదిదరులు పాల్గొన్నారు.

విశ్వ హిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం శాంతినగర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాషాయం, ఓంకార ధ్వజాన్ని నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధర్మప్రసాద్, సత్యం, మాణిక్యం, వెంకటేశ్వర్లు, వ్యాపార సంఘం తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌కు వస్తే బురద అంటాల్సిందే



మానవపాడు: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బురదతో నానా అవస్థలు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్దెల వసూళ్లు తప్పా బస్టాండ్ అభి వృద్ధికి నోచుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

అయిజ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరాపార్కులో సీపీఎస్ రద్దు కోసం చేపట్టనున్న మహాధర్నా పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు పచ్చర్ల తిమ్మారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఎజెండాలో సీపీఎస్ రద్దు అనే హామీ ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వం వాగ్దానాన్ని నిలబెట్టుకొని సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కని, సీపీఎస్ అనేది భద్రతలేని విధానమన్నారు. ఉద్యోగుల భవిష్యత్ రక్షణ కోసం సీపీఎస్ రద్దు తప్పనిసరని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఏబేలు, ప్రధాన కార్యదర్శి వీఎస్ వేణుగోపాల్, అసోసియేట్ అధ్యక్షుడు రవి, సర్వేశ్వరాచారి, మండల అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

అట్టహాసంగా అంతర్రాష్ట్ర భజన పోటీలు



గాయకులను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

ఎర్రవల్లి: మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామంలో కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని కృష్ణ స్వామి ఆలయంలో అంతర్రాష్ట్ర భజన పోటీలు నిర్వహించారు. పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 18 టీంలు పాల్గొన్నాయి. పోటాపోటీగా భజన బృందం గాయకులు గానాలతో భజన కార్యక్రమాలు నిర్వహించారు. పోటీలో లక్ష్మంపల్లి, మండ్లవాసిపల్లికి చెందిన టీంలు మొదటి విజేతగా నిలిచాయి. ఉత్తమ గాయకుడిగా రామచంద్రుడు, ఉత్తమ హార్మోనిస్టుగా కోటేశ్వరనాథ్, రాజు, ఉత్తమ తబలిస్టుగా మహేష్, వీరేషలు నిలిచారు. వివిధ విభాగాల్లో గెలుపొందిన వారిని శ్రీకృష్ణ దేవాలయ కమిటీ నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ధరూరులో భారీ వర్షం



ధరూరు: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశ మేఘవృతమై చిరుజల్లులు కురిశాయి.సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. సీడ్‌పత్తి సాగుకు ముసురు వర్షం ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా సరిహద్దులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను బ్లూకోర్టు పోలీసులు ఆదివారం ప ట్టుకొని కేసు న మోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తె లిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని తాడిపత్రి నుంచి తెలంగాణలోని పెబ్బేరు కు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా రాష్ట్ర సరిహద్దులో స్వాధీనం చే సుకున్నామన్నారు. టిప్పర్ డ్రైవర్ పవన్‌కుమా ర్ కేసు నమోదు చేసి టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆదమరిచారో.. ప్రమాదం తప్పదు



మానవపాడు నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు..



ఇటిక్యాల సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు



కోతకు గురైన సీటీపాడు శివారులోని రోడ్డు

ఇటిక్యాల: మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతల మయంగా మారి అవస్థలు పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై గుంతలను పూడ్చి, మరమ్మతు చేపట్టాలన్ని పలుమార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రోడ్డు సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతు చేయండి సారూ..

అయిజ: గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చిన్న తాండ్రపాడు శివారులో ఆర్డీఎస్ డిస్ట్రిబ్యూటర్ 17 సమీపంలో రోడ్డు ధ్వంసమైంది. దీంతో వివిధ గ్రామాలకు వాహనాలపై వెళ్లేందుకు వీలు లేకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. భారీ వర్షాలు కురిస్తే రోడ్డు మొత్తం కోతకు గురయ్యే ప్రమాదముందని, వెంటనే మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా మూల మలుపు

మానవపాడు: మండల కేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే ప్రధాన రహదారి జూరాల కాల్వ వద్ద మూల మలుపు ప్రమాదకరంగా ఉందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. మలుపు వద్ద ఉన్న కల్వర్టు వద్ద రక్షణ గోడ లేక ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. తక్షణమే రక్షణ గోడను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

వీధి కుక్కలతో బెంబేలు



ఉండవెల్లిలో కుక్కల గుంపు

- మండల కేంద్రంలో వెంబడిస్తూ దాడులు
- కుక్కల చక్కర్లతో భయం భయం
- పలువురికి తీవ్రగాయాలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని వీధికుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడులకు పాల్పడుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలపై దాడికి పాల్పడుతున్నట్లు పేర్కొంటున్నారు. బయటకు వెళ్లాలంటేనే ఇబ్బంది పడుతున్నట్లు వాపోతున్నారు.

గుంపులు గుంపులుగా సంచరిస్తూ..

మండల కేంద్రంలోని ఏ వీధిలో చూసినా శునకాలు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఏదైనా పనినిమిత్తం బయటకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. సుమారు 100కు పైగా కుక్కలు వీధుల్లో తిరుగుతున్నట్లు తెలిపారు. బైక్‌లు, సైకిళ్లపై వెళ్లేటప్పుడు వెంటపడుతున్నాయని దీంతో వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాల పాలవుతున్నట్లు వాపోతున్నారు.

చిన్నారులపై దాడులు

గత నెలలో మండల కేంద్రంలో 5 మంది చిన్నారులు, ఇద్దరు వ్యక్తులపై వీధికుక్కలు దాడి చేసినట్లు ప్రజలు వాపోతున్నారు. గతేడాదిలో మండల కేంద్రంలో ఓ వ్యక్తిపై దాడి చేసి ఆస్పత్రి పాలై మృతి చెందినట్లు తెలిపారు.

మండలంలో పీహెచ్‌సీ లేక రేబిస్ వ్యాక్సిన్లు కూడా అందుబాటులో ఉండటం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి వీధికుక్కల బెడద నుంచి కాపాడాలని వేడుకుంటున్నారు.



రాత్రి సమయంలో కుక్కల గుంపు

ఎటు చూసిన కుక్కలే



ఉండవెల్లిలో ఎటుచూసినా వీధి కుక్కల బెడద ఉంది. పని నిమిత్తం బయటకు వెళ్లాలంటేనే భయమేస్తుంది. ఇప్పటికే చాలా మంది కుక్కల దాడిలో గాయపడి గాయాలపాలయ్యారు.

– పరుశురాం, ఉండవెల్లి

వెంటపడుతున్నాయి



పాఠశాలలకు వెళ్తున్న చిన్నారులను కుక్కల గుంపు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రోడ్డుపై వెళ్తున్న వాహనాల వెంట పడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది.

– గోపాల్, ఉండవెల్లి